# మిత్ర చతుష్టయం

రోజులు, వారాలు గడిచిపోయాయి. ఆఖరకు చూస్తూ చూస్తూ ఉండగానే మాసం రోజులు కూడా దొర్లి పోయాయి. కాని ఎంత ప్రయత్నించినా రాజేశ్వరరావుకు ఉద్యోగం మాత్రం దొరకలేదు. అయితే, అతను నిరాశ చెందలేదు. ఎట్లాగయినా సరే ఉద్యోగం సాధించి తీరాలనే నిర్ణయించుకున్నాడు. అందుకే తన మేనమామకు ఇంకో ఉత్తరం రాశాడు— నా ప్రయత్నం నేను చేస్తున్నాననీ, ఉద్యోగం దొరకవచ్చునీ, అందాకా రావటం ఇష్టంలేదు గనక ఇంకో ఏభై రూపాయలు పంపించమని!

రాజేశ్వరరావు మేనమామ డబ్బు పంపిస్తూ వెనకటి లాగా కాకుండా ఈసారి కొంచెం బాధపడుతూ ఉత్తరం రాశాడు—"ఉద్యోగం నిమిత్తం నువ్వెళ్ళి నెలరోజులయింది. ఏమీ దొరకలేదన్నావు! ఎప్పటికి దొరుకుతుందో కూడా నువ్వు రాయలేదు...నీ తల్లి చనిపోయినప్పటినుంచీ నిన్నెంతో గారాబంగా పెంచి పెద్దవాణ్ణి చేసి నా శక్తికొలదీ చదివించాను. ఏదో ఉద్యోగం కూడా దొరికితే నీ పెళ్లి చేయాలని నా ఆలోచన! ఆ పైన నీ ఇష్టం!"

ఉత్తరం చదువుకుని రాజేశ్వరరావు ఏదో మనస్సులో గునిశాడు—"మామ నా పెళ్లికి తొందర పడుతున్నాడు. ఆయ నకే గనక ఆడపిల్ల లుంటే ఈపాటికి నా మెడలో గుదిబండ పడి వుండేది! ఆయనకు పిల్లా జెల్లా లేకపోవటం ముందు నాకు మేలు జరిగింది!"

రాజేశ్వరరావు బి. కాం. ప్యాసై...ఎవరో దూరపు బంధువు ఉద్యోగం ఇప్పిస్తానని ఆశచూపిస్తే మద్రాసు పరుగెత్తు కొచ్చి నానా అగచాట్లు పడ్డాడు. ఆయనగాదని ఈయన్నూ, ఈయన్నూ వదలి మరొకర్ని—ఈ విధంగా రకరకాల వ్యక్తుల్ని-ఇళ్ళ దగ్గరా, ఆఫీసుల్లోనూ విధి విరామం లేకుండా కలుసు కొని తన గోడు వివరించగా విన్పించుకున్న మహానుభావుడే కన్పించలేదు! కాలితిప్పట తప్పిస్తే ఫలిత మేమీ కనిపించలేదు!

రాజేశ్వర్రావు ఆ తరువాత బజార్ల వెంట పిచ్చివాడికి మల్లే తిరిగాడు! ఎవరయినా మిత్రులు కన్పిస్తే బావుండునని... నగరమంతా గాలించాడు! కాని ఎక్కడా ఎవరూ కన్పించ లేదు. కన్పించిన వాళ్ళంతా ఏదో ముంచుకుపోతున్నట్లు గబ గబా తప్పుకుపోయేవారు! వ్యక్తికీ మరో వ్యక్తికీ మధ్యన ఏదో అగాధమైన లోయ లున్నట్లనిపించింది — రాజేశ్వ ర్రావుకు!

ఒక రోజున రాజేశ్వర్రావు కాఫీతాగి పత్రిక ఒకటి కొని...బజారున బయలుదేరాడు! 'వాంటెడ్ కాలమ్స్'లో తనకు పనికివచ్చే దేదీ కన్పించకపోవటం మరింత బాధగా వున్న దేమో....మనుషుల మొహాలవేపు పరీక్షగా చూస్తూ నడుస్తూ

న్నాడు! ఇంతటి కోలాహలం మధ్యన ఒంటరిగా కాలం గడపటం మహా దుర్భరంగా వుంది! ఒక వ్యక్తి తన పక్కన వుండటం చాలా అవసరమని అతను భావిస్తున్నాడు!

అకస్మాత్తుగా రాజేశ్వర్రావు దృష్టి రోడ్డుకు అటువేపు నున్న బట్టలషాపు షోకేస్‌ని అతి ఆపేక్షగా చూస్తున్న వ్యక్తి మీదికి పోయింది. ఒక్క పరుగున వెళ్లి—"ఏరా కోటీ! బట్టలు కొనబోతున్నావా ఏంటి?" అన్నాడు రాజేశ్వర్రావు అతని వీపు తట్టి! అతను ఉలిక్కిపడి రాజేశ్వర్రావు వేపు తిరిగాడు— "ఓహో, నువ్వా భాయ్! ఎంతకాలానికి కన్పించావ్?.... ఇక్కడేమయినా ఉద్యోగం చేస్తున్నావా ఏంటి?....నాకూ కాడా ఏదైనా చపరాసీ ఉద్యోగం చూచి పెట్టరాదూ...వంద రూపా యలు ఎట్లాగో సంపాదించి సినిమాల్లో చేరదామని వచ్చా; అయితే రెండో రోజున ఆ డబ్బు కాస్తా ఎవరో కొట్టేశారు! బజార్లు పట్టుక తిరుగుతున్నా! నా విషయం విన్నవాడే కన్పించ లేదు! రెండురోజు లయింది తిండితిని!....ఏమంటావ్?"

రాజేశ్వర్రావు వరుసగా తన విషయాలు ఏకరువుబెట్టాడు! హోటల్లోకి లాక్కెళ్తూ అన్నాడు—"ఒరేయ్! కోటీ! ముందు పొట్ట నింపుకో!...నేను ఇరవయి చోట్లకు అప్లికేషన్లు పంపిం చాను! ఏదో ఒక ఉద్యోగం రాకపోదు! ఇంటర్ నాలుగు సంవత్సరాలు చదివిన నీకు చపరాసీ ఉద్యోగమేంటి ఖర్మ— క్లర్కు పోస్టు ఇప్పిస్తాను! చూస్తూ వుండు!"

"భేష్ బ్రదర్!" అన్నాడు కోటి!

* * * *

రాజేశ్వర్రావు ఉద్యోగం రానూ లేదు; కోటేశ్వర్రావుకు అతను క్లర్కు-పోస్టు ఇప్పించనూ లేదు. అయితే అతను చేసిందల్లా తనతో పాటు కోటేశ్వర్రావుకు కాఫీ ఇప్పించాడు; కట్టుకోడానికి గుడ్డ లిచ్చాడు! 'స్టారు' మార్కు సిగరెట్లు సప్లయి చేశాడు! తన చాపమీదనే సగభాగం అతనికి కేటాయించాడు! జీవితం మీదనే విరక్తి చెందిన కోటేశ్వర్రావుకు భవిష్యత్తుమీద ఆశ జనించే ఉత్సాహం సరఫరా చేశాడు! సరదాగా బజార్ల వెంట తిప్పాడు!

ఇంతలోకే రాజేశ్వర్రావు దగ్గరున్న డబ్బు కాస్తా అయిపోయింది. మళ్ళీ తన మేనమామకు రాయటం అతని కిష్టం లేదు. ఇక కోటేశ్వర్రావుకు ఆస్కారం కూడా లేదు. నాటకాలలో తిరగటం ప్రారంభించినప్పటినుంచీ అతన్ని ఇంటిదగ్గరవాళ్ళు ఒక రకంగా బహిష్కరించారు! సమయానికి రాజేశ్వర్రావు కన్పించి వుండకపోయినట్లయితే అతను దేశదిమ్మరయిపోయి వుండేవాడు; లేదా ఏ రైలు కిందనో తల పెట్టేసుకునేవాడు!

రాజేశ్వర్రావు ఆ రోజు కాఫీ తాగాక తన జేబులో మిగిలివున్న ఆఖరు అర్ధరూపాయ చూపిస్తూ కోటేశ్వర్రావుతో అన్నాడు—"ఒరే! ఇదీ మన దగ్గర మిగిలిన ఆస్తి! 'కోటేశ్వర్రావు విచిత్రంగా నవ్వాడు—దీంతో "మనం రెండురోజులు కాలక్షేపం చెయ్యొచ్చు! అయిదో తారీఖున ముకుందరా వొస్తాడన్నావుగా! అయిదూ పదీ లేకుండా వస్తాడా? అథవా వాడి దగ్గరా లేకపోతే అప్పటి కాలోచిద్దాం! ఎవరు చూచారు—ఈ లోపునే నీకో, నాకో ఏదో ఒక ఉద్యోగం దొరకొచ్చు-పోతుందా?"

కోటేశ్వర్రావు అర్ధరూపాయితో రెండురోజులు ఎట్లా కాల క్షేపం చెయ్యొచ్చునో—లెక్కలు వేసి చెప్పాడు. చివరకు ఆ సాయంత్రం కాలినడకను—బీచ్‌కి వెళ్ళే ప్రోగ్రాం కూడా వేసుకున్నారు!

సాయంత్రం అయిదింటికి అలవాటు ప్రకారం కాఫీ తాగాలి! కాని తాగలేదు! వాళ్ళు తాగింది - కార్పొరేషన్ వాటర్! కోటేశ్వర్రావు అవి తాగి ఇలా అన్నాడు—"ఈ నీళ్ళు మన కృష్ణానది నీళ్ళంత రుచిగా లేవు!" 'ఏడ్చేవులే నీళ్ళకు రుచేంటి?' అని రాజేశ్వర్రావు డబాయించాడేగాని-తీరా తాగే ప్పటికి అతనికీ అలాగే అనిపించింది! ఆ చప్పదనం నీళ్ళల్లో వున్నదో లేక కడుపులో టిఫిన్ పడకపోవటవల్ల అలా ఉన్నదో అతనికి అర్థం కాలేదు!

అందంగా అతి విలువగల బట్టలేసుకొని కన్పించిన ఆడ వాళ్ళనూ మగవాళ్ళనూ తప్పుకుంటూ శాంథోన్ నుంచి మెరినా క్యాంటిని దాకా ఇద్దరూ దేకుకుంటూ వచ్చారు! కోటేశ్వ ర్రావు కాళ్ళుపీక్కుపోతున్నా యన్నాడు! రాజేశ్వర్రావుకు నాలుక పిడచకట్టుకపోతున్నది!—'ఈ అర్ధరూపాయి పెట్టి ఈ క్యాంటీ న్‌లో తినేద్దాం- రేపటి విషయం రేపు చూచుకో వచ్చు!' అన్నాడు రాజేశ్వర్రావు. మెరీనా క్యాంటీన్‌కు ఎదురుగా వున్న సిమెంటు బల్లమీద కూలబడుతూ, 'పచ్చి మంచినీళ్ళు తాగి వారం రోజులు గడపేవాళ్ళున్నారు! నువ్వు ఒక పూటకే దిగాలు పడిపోతున్నావు! అంటూ కోటేశ్వర్రావు—అప్పుడే క్యాంటీన్ వేపు వెళ్తున్న కొందరు వ్యక్తుల్ని పరీక్షగా చూడ సాగేడు! ఒక్కసారిగా లేచి నిల్చొని, 'ఏ లక్ష్మీశ్వర్రావ్!'

అన్నాడు ఆ వ్యక్తి. వెనక్కి తిరిగి వాళ్ళదగ్గరి కొచ్చాడు. 'అరే మీరా ?....ఏం చేస్తున్నారోయ్ ?....చదువా, ఉద్యోగమా ?' అన్నాడు ! 'ఆ రెండో దానికోసమే ఇక్కడ మకాం చేశాం ! అయితే, ఇంకా ఆ దేవి మమ్మల్ని వరించలేదు !' అన్నాడు కోటీశ్వర్రావు !

లక్ష్మీశ్వర్రావు పేంటు జేబులో చేతులు పెట్టుకొని కిల కిలమని నవ్వాడు—కోటీశ్వర్రావు మాటలకు ! రాజేశ్వర్రావు కాళ్ళు సవరించుకుంటున్నాడు ! 'సరే రండి-కాఫీ తాగి వద్దాం' అని లక్ష్మీశ్వర్రావు చెరొక రెక్కా పుచ్చుకొన్నాడు ! ఇద్దరూ అతణ్ణి అనుగమించారు !

మెరీనా క్యాంటీన్‌లో ముగ్గురి మధ్యా చాలా విషయాలు దొర్లిపోయాయి ! ఎవ రెవరు ఏమేం జేస్తున్నారో చెప్పు కున్నారు !....రాజేశ్వరి, నాగమణి 'వంకాయమ్మ'.... విషయాలు లక్ష్మీశ్వర్రావు దర్యాప్తు చేయగా....కోటీశ్వర్రావు వివరాలన్నీ నిమిషాల మీాద సరఫరా చేశాడు !

మూడు రూపాయల బిల్లయింది. లక్ష్మీశ్వర్రావు బిల్లు చెల్లిస్తున్నప్పుడు-రాజేశ్వర్రావు, కోటీశ్వర్రావు బయటకొచ్చి స్విమ్మింగ్ పూల్ పక్కన నిలబడ్డారు. 'వీణ్ణి అయిదో పదో బదులు అడగనా ?' అన్నాడు కోటీశ్వర్రావు. 'మూడు రూపా యలు బిల్లు చేశాం. అది చాలదూ ? పచ్చి మంచినీళ్ళు తాగుతూ వారం రోజులు గడిపే మనుషులున్నారని నువ్వే అన్నావుగా !' అని రాజేశ్వర్రావు అతణ్ణి కసిరాడు !

ఉభయులు రాత్రి తొమ్మిదింటికి గదికి చేరేప్పటికి గది ముందు ఆర్టిస్టు నారాయణ కూచుని వున్నాడు ! నాలుగు గజి

బిజి గీతలు గీసి దాంట్లోనుంచి ఒక అందమైన చిత్రాన్ని కల్పిస్తాడు; అయితే అతని జీవితం మాత్రం ఒడిదుడుకుల మధ్య గడిచిపోతున్నది!

'ఎక్కడికి వెళ్ళారేంటి?' అన్నాడు నారాయణ. 'వీడు-మన గుడ్ ఫ్రెండ్ లెండి... పేరు కోటేశ్వరరావు. మంచి యాక్టర్! సినిమాల్లో చేరటానికి వచ్చాడు... అల్లా బీచికి వెళ్దామంటే సరే నన్నాను. 'ఒరే కోటీ! వీరు నారాయణగారని చెప్పానే... వారు. బ్రహ్మాండమైన ఆర్టిస్టు! ప్రస్తుతం పరిస్థితులు సానుకూలించనందున... కొంచెం ఒడిదుడుకుల్లో వున్నారు!' అని చెబుతూ రాజేశ్వరరావు గదితలుపు తెరిచాడు.

'చాలా బాగా చెప్పారు!... అక్షరాలా నా స్థితి అలాగే వుంది... రేపటికల్లా గది ఖాళీ చేయమని యజమాని తాఖీదిచ్చాడు. మీ గదిలో వుంటానికి వీలవుతుందేమోనని అడిగేందుకు వచ్చాను!... ఏమంటారు?' అన్నాడు నారాయణ!

'ఏముంది అనటానికి? మీ రీ రాత్రికే వచ్చేసినా మా కిష్టమే!... అంతా సరదాగా కాలక్షేపం చేద్దాం! అయిదో తారీఖున ముకుందరావనే మరో ఫ్రెండ్ వస్తున్నాడు...మంచి కథకుడు!'

నారాయణ ఆ రెండవరోజు ఉదయానికి ఉదయమే వచ్చాడు. 'ఈజెల్,' కుంచెలూ, రక రకాల రంగులూ, చిత్రాలూ-ఆయన సామాను! 'హిరోషిమా' అనే చిత్రం చూచి కోటేశ్వరరావు, రాజేశ్వరరావు మూర్ఛ పోబోయ్యారు! అది ఆటంబాంబుకు గురైన వ్యక్తుల్ని అతి బీభత్సంగా చిత్రీక

రించబడింది. దాని అడుగున అందమైన అక్షరా లున్నాయి - 'నో మోర్ హిరోషిమాస్' అని.

ముగ్గురూ సమిష్టిగా కాలక్షేపం చేస్తున్నారు. అయిదో తారీఖున ముకుందరావు వచ్చాడు. రాజేశ్వరరావు అతన్ని నారాయణకు పరిచయం చేశాడు. కోటేశ్వరరావు ముకుంద రావుకు తగిన ఏర్పాట్లు చేసి ఆఖరున జేబు తడిమి చూచాడు. రెండు అయిదులూ, కొంత చిల్లరా కన్పించింది. ఈ విషయం అందరికీ బహిరంగ పరచి ఇంకో వారం పదిరోజులు నిశ్చింతగా కాలం గడిచిపోగలదని అంచనా వేసి చెప్పాడు. ముకుందరావు 'ఫైనాన్సు శాఖ' కోటేశ్వరరావుకే అప్పగించాడు. కోటేశ్వర రావు దాన్ని స్వీకరించాడు.

కోటేశ్వరావు మరికొన్ని పనులు కూడా తన నెత్తిని వేసుకొన్నాడు. గదిని శుభ్రపరిచేవాడు! నారాయణ కుంచెలు కడిగి పెట్టేవాడు! ముకుందరావు కథలకు పేజీ నంబర్లు వేసి సక్ర మంగా వుంచేవాడు. చిందరవందరగా వుండే రాజేశ్వరరావు అక్షి కేషన్ల నకళ్ళు - సరిగ్గా అమర్చి వుంచేవాడు. గదిలో అంతా ఎవరి పనుల్లో వాళ్ళు మగ్నమై వున్నప్పుడు కోటేశ్వర రావు చేసేపని. ఒక మూలన చాపవేసుకొని గుర్రుపెట్టి నిద్ర పోవటం.

రాజేశ్వరరావుకు ఉద్యోగం లేదు. ముకుందరావు పంపిం చిన రచనలేవీ ఇంకా పత్రిక ముఖాన వెలువడలేదు. నారాయణ ఆర్టును గురించి అడిగినవాడే కన్పించలేదు. కోటేశ్వరరావు ముసుగు పెట్టుకొని నిద్రబోతే, నిద్రలో తాను సినిమాల్లో

హీరో అయిపోయినట్లు- ప్రతిరోజు కలలు వస్తున్నాయే గాని లేచి చూచుకుంటే ఏమీ కన్పించటం లేదు.

ఒకరోజున ఉదయానికి ఉదయమే లేచి కోటేశ్వరరావు 'అన్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ లాడ్జి' అని ఒక అట్టమీద పెద్ద పెద్ద అక్షరాల్లో రాసి గదిముందు తగిలించాడు. ఎవరూ ఏమీ అనలేదు. అయితే ఆ రాత్రికి రాత్రే నారాయణ ఒక రంగు చిత్రాన్ని చిత్రించి దానికింద అందమైన అక్షరాల్లో 'వుయ్ నీడ్ ఎంప్లాయ్‌మెంట్' అని రాశాడు. ఆ చిత్రం అందరికీ నచ్చింది. కారణం! కాన్వొకేషన్ హాల్‌నుంచి బి. కాం., డిగ్రీ, చేతబుచ్చుకొని వస్తునట్లుగా చిత్రించిన బొమ్మకు రాజేశ్వరరావు పోలికలున్నాయి. ముకుందరావు కలంతో తెగబరికేస్తున్నట్లున్నది మూడోది! 'అవారా' లోని 'రాజకపూర్' పోజులో కోటేశ్వరరావు బజారు నుండి పరుగెత్తుతున్నాడు- ఇక అన్నిటికంటె ఆఖరున - ఆర్టిస్టు నారాయణ చిరిగిన బట్టలతో చింతాక్రాంతంగా కూర్చొని వున్నాడు.

అంత మంచి బొమ్మను గీసినందుకు ముకుందరావు, రాజేశ్వరరావు నారాయణ్ణి, అభినందిస్తున్న సమయంలోనే కోటేశ్వరరావు అన్నాడు- 'సరేగాని- మీ అందరికీ తెలుసుగా?- మన కంపెనీ ఖాతాలో చిల్లికానీ నిల్వలేదు!' అప్పుడు అంతా మళ్ళా లోటు బడ్జెట్టును గురించి తర్జన భర్జనలు చేశారు! ఎవరి మట్టుకు వాళ్ళు 'రేపు' మీద ఆశను వెల్లడించారేగాని ఆ రోజు ఎలా గడుస్తుందో దాన్ని గురించి ఎవరూ మాట్లాడలేదు. అంతా బజారుకు బయలుదేరారు.

* * *

'రేపు' 'ఇవ్వాళ్ళ' గా మారింది. కాని 'ఇవ్వాళకూడా నిన్న' లాగే వున్నది. మళ్ళా నిన్నటి లాగా నలుగురూ బజారుకు బయలుదేరారు. అయితే నలుగురూ అతి గంభీరంగా వున్నారు. వాళ్ళ 'రేపు' నిజం కానందుకు అంతా బాధపడుతున్నట్లున్నారు.

హోటలు పక్కనున్న కిళ్ళీషాపు దగ్గరి కెళ్ళటంతో 'ఏం పాపతను పేపరు వేణుమా సార్?' అన్నాడు. 'వాంటెడ్ కాలమ్స్' చూచి ఇచ్చేస్తాం. ఇవాళ్ళ మా దగ్గర డబ్బులు నిండుకున్నాయప్పా' అన్నాడు కోటేశ్వరరావు-రాజేశ్వరరావుకు బదులుగా. 'పరవాయిల్లే పారుంగో సార్!' అని పాపతను పేపరిచ్చాడు రాజేశ్వరరావు చేతికి. ముగ్గురూ అతన్ని చుట్టు ముట్టారు. అయితే ఎప్పటికి మల్లే 'వాంటెడ్ కాలమ్స్' లేవు. ఒక పెద్ద రేడియో ఎడ్వర్టైజ్‌మెంట్ వుంది- 'యువర్ హోమ్ నీడ్స్ ఏ రేడియో!' 'రేడియో వీక్' సందర్భంగా ధరలు కగ్గించబడ్డాయట. ఆరు నెలల రేడియో లైసెన్సూ, ఏరియల్ ఫ్రీ. ఈ తరుణం మించిపోతే మళ్ళా రాదట. అందుకని రేడియో వాళ్లు అందర్నీ తొందర పడమంటున్నారు- 'యువర్ హోమ్ నీడ్స్ ఏ రేడియో'- పేజీ అంతా ఆక్రమించింది.

రాజేశ్వరరావు పేపరు మడిచి కిల్లీ పాపతనికిచ్చేశాడు. నలుగురూ బజారున బడి నడుస్తున్నారు. ప్రతి టర్నింగ్‌లోనూ 'యువర్ హోమ్ నీడ్స్ ఏ రేడియో' బేనర్లు గాలికి ఎగిరెగిరి పడుతున్నాయి. అన్ని భాషల పత్రికలూ ఈ ఎడ్వర్టైజ్‌మెంట్‌ను ప్రముఖంగా ప్రచురించాయి. రేడియో షాపులన్నీ అందంగా అలంకరించబడ్డాయి.

నాలుగు బజార్లు కలిసిన ఒక పెద్ద కార్నర్‌లో నలుగురూ నిలబడిపోయారు. నడిచే ఓపిక కూడా వాళ్ళలో నశించి పోయింది. లోపల పేగులు మెలితిరిగి పోతున్నాయి. ఎదురుగా వున్న ఒక పెద్ద రేడియో షాపుమీద 'యువర్ హోమ్ నీడ్స్ ఏ రేడియో' బేనర్ ఎగిరెగిరి పడుతున్నది. 'మీా రిక్కడే వుండండి' ఇప్పుడే 'వస్తాను.' అంటూ నారాయణ ఒక్క పరుగున ఆ షాపులో జొరబడ్డాడు. తక్కిన ముగ్గురూ అక్కడే నిలబడ్డారు. 'మనవాడు ఇవ్వాళ్ళ గడిచే మార్గం ఏదో వెదికాడు.' అన్నాడు కోటేశ్వరరావు. పది నిమిషాలయిందో లేదో నారాయణ గబగబా వాళ్ళను సమీాపించి, 'పరుగెత్తండి, పరుగెత్తండి.' అన్నాడు. నలుగురూ బజారునబడి పరుగు లంకించుకున్నారు. ఇంకా వంద గజాల దూరంలో వాళ్ళ గది వుందనగా వెనకనుంచి పోలీసులు రావటం రాజేశ్వరరావు చూచి- విమయ మేంటన్నాడు. 'నేను మేనేజరు దగ్గరికెళ్ళి డిప్లొమా సంపాదించిన ఆర్టిస్టుననీ, 'యువర్ హోమ్ నీడ్సు ఏ రేడియో' బేనర్సు రాసేపని వుంటే ఇప్పించమనీ అడగ్గా 'ఛీఛీ ఫో! రాడీ వెధవా!' అన్నాడు. టేబుల్ మీాదున్న పేపర్ వెయిట్ అతని మొహాని కేసి కొట్టాను. అతను పోలీస్ స్టేషనుకు ఫోన్ చేశాడు!'- రొప్పుతూ రోజుతూనే చెప్పాడు నారాయణ.

నలుగురూ గదిలో కొచ్చిపడ్డారు. అందరి గుడ్డలూ చెమటతో తడిసిపోయాయి. శోషరావటంచేత అందరూ ప్రాణం లేని మనుషులుకుమల్లే ఎక్కడివాళ్లు అక్కడ పడిపోయారు. ఇంతలోకి పోలీసులు వాన్‌లో రానే వచ్చారు. అందర్నీ వరసగా లేపారు. తోటకూర కాడలకు మల్లే నలుగురూలేచి నిలబడ్డారు.

ఆ ప్రాంతంలోనే నాలుగు రోజులకిత్రం పట్టపగలు సైకిలుమీద పోతున్న వ్యక్తిని అడ్డగించి డబ్బు దోచుకున్న నలుగురు వ్యక్తుల ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు- వీళ్ళ నలుగుర్నీ చూడగానే- వాళ్ళ అనుమానం ధృవపడింది. 'నడవండి స్టేషనుకు' అన్నాడు ఇనస్పెక్టర్. నలుగురూ బయటికి నడిచి వ్యాన్‌లో కూచున్నారు. కొద్దిసేపటికే పోలీసు వ్యాన్ ఆ పెద్ద రేడియో షాప్ ముందుగా వెళ్ళింది. వాళ్ళనలుగురికీ ఎదురుగా కూచున్న హెడ్ కానిస్టేబుల్ చేతిలో నారాయణ గీసిన చిత్రం మీద 'వుయ్ నీడ్ ఎంప్లాయిమెంట్' అనే అక్షరాలు వెలా తెలా పోతున్నాయి

కొద్దిసేపటికి రాజేశ్వరరావు పేరుతో వచ్చిన ఉత్తరం పోస్టు జవాన్ కిటికీలోగుండా లోపల పడేసి వెళ్ళాడు. దాంట్లో అతని మేనమామ- 'ఉద్యోగం దొరక్క-పోతే పోయిందిలే' ఇంటికి వచ్చేయ్! నీ పెళ్ళి ఖాయం చేశాను!' అని రాశాడు-